హైదరాబాద్ వార్త

# ప్రభుత్వ భూములు కబ్జాలు కాకుండా చర్యలు

**మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్**

**ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత అధికారులు తీసుకోవాలి**

**తహసీల్దార్లు విధులను సజావుగ నిర్వహించాలి**

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 12, ప్రభాతవార్త : జిల్లా వ్యాప్తంగ ప్రభుత్వ భూములు కబ్జాలు కాకుండ తగు చర్యలు తీసుకుంటున్నట్లు మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాద్యత అధికారులపై ఉందని ఆయన అన్నారు. తహసీల్దార్లు తమ విధులను సజావుగ నిర్వహించాలని ప్రభుత్వ భూములు కబ్జాలు కాకుండ ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియ, ఆర్డీవోలు, జిల్లాలోని వివిధ మండలాల తహసీల్దార్లతో కలెక్టర్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగ కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ భూములు కబ్జాలు కాకుండ అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఇతరుల స్వాధీనంలో ఉంటే వారికి వెంటనే నోటీసులు జారీ చేసి వాటిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భూముల వివరాలు తెలుసుకుని వాటిని ఎవరైనా కబ్జాలు చేసినట్లు ఉంటే వెంటనే పోలీసు బలగాలతో సంబంధిత ప్రదేశంలో ప్రభుత్వ భూమి అని సూచించేలా బోర్డుతో పాటు కంచెను ఏర్పాటు చేయాలని కలెక్టర్ తహసీల్దార్లకు సూచించారు. ఈ విషయంలో ఎంతో జాగ్రత్తగ వ్యవరించాలని ఇబ్బందులు తలెత్తకుండ ముందస్తుగా కబ్జాలో ఉన్న వారికి సమాచారం అందించటంతో పాటు పోలీసు బలగాలతో అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. కబ్జాలు చేసిన వారు ఇబ్బందులకు గురిచేస్తే తమ దృష్టికి తీసుకావాలని కలెక్టర్ వారికి సూచించారు. ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా వ్యాప్తంగ రెవెన్యూ అధికారులతో ప్రతి 15రోజుల కోసారి అన్ని విషయాలపై సమావేశాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు అధికారులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకరాగ ఆయన సానుకూలంగ స్పందించి వారి ఇబ్బందులు, సమస్యలను పరిష్కరించే దిశగ చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ విషయంలో అధికారులకు అండగ ఉంటానని భరోసా ఇచ్చారు. విదులు సక్రమంగ నిర్వహిస్తూ ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండ చూడాలని కలెక్టర్ గౌతమ్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వారితో పాటు ఆర్డీఓలు రాజేశ్‌కుమార్, శ్యామ్‌ప్రకాశ్, జిల్లాలోని తహసీల్దార్లు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పాతబస్తీ జహానుమాలోని సెయింట్ మార్క్స్ బాయిస్ టౌన్ హైస్కూల్‌లో మంగళవారం ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరిగాయి. డైరెక్టర్ బ్రదర్ ప్రభహారన్,థామస్,ప్రిన్సిపాల్ షౌరెడ్డి పాఠశాల పాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు



# కమిషనర్ సారూ.. ఏసిపి లీలలు చూడరూ!

**సర్కిల్ 23లో అక్రమ నిర్మాణాల జోరు**

**అధికారులకు రూ.కోట్లు.. జిహెచ్‌ఎంసికి తూట్లు**

**డిప్యూటీ కమిషనర్ మౌనంలో ఆంతర్యమేమిటో**



బాలానగర్ జోన్‌ప్రతినిధి, డిసెంబరు 12 ప్రభాతవార్త: మూసాపేట సర్కిల్ 23లోని పలు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు పెద్దఎత్తున వెలుస్తున్నా డిప్యూటీ కమిషనర్(డీసీ) అసిస్టెంట్ సిటీ ప్లానర్(ఏసీపీ)లు పట్టించు కోవడంలేదు. ఈ విషయంలో జిహెచ్‌ఎంసి కమిషనర్ దృష్టిసారించి అక్రమ నిర్మాణాల విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్న డిప్యూటీ కమిషనర్‌తోపాటు ఏసీపీలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అనేక ప్రాంతాల్లో వ్యక్తిగత గృహ నిర్మాణాలతోపాటు వ్యాపార, వాణిజ్య సముదాయాలు, అపార్ట్‌మెంట్లను నిబంధనలకు విరుద్దంగా బిల్డర్లు పెద్ద ఎత్తున నిర్మిస్తున్నారు..23 సర్కిల్ ఏసీపీ కార్యాలయం లో పనిచేస్తున్న ఓ కీలక అధికారి సహకరిస్తూ కోట్లాది రూపాయల్ని తన జేబుల్లో వేసుకుంటున్నట్లు తెసింది. స్థిర నివాసాలు ఏర్పాటుకు సామాన్యుడికి అందుబాటులో లేని విధంగా కెపిహెచ్‌బికాలనీ, మూసాపేట, బాలాజీనగర్ ప్రాంతాల్లో భూముల రేట్లు ఉన్నాయి. మెయిన్ సెంటర్లలో అయితే ఏకంగా గజం రూ. 1లక్షకు ఎక్కడా తక్కువ లేకుండా ఉంది. గల్లీల్లో కూడా గజానికి రూ.రూ.70 వేల నుంచి అంతకు పైగానే భూముల రేట్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బహుళ అంతస్తుల భవనాల్లో ప్లాట్లను కొనుగోలు చేసేందుకు ఉద్యోగులు, అధికారులు, వ్యాపార వేత్తలు , వాణిజ్యవేత్తలు రిటైర్డ్ ఉద్యోగులు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో బహుళ అంతస్తుల భవనాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తు న్నాయి. నిబంధనలకు పాతరేసి బిల్డర్లు ఈ భవనాలను చక చకా నిర్మిస్తున్నారు. ఏమిటని అడిగే నాధుడే లేకుండా పోవ డంతో తమ ఇష్టారాజ్యంగా అంతస్తుల మీద అంతస్తుల్ని నిర్మిస్తున్నారు. కొందరు సర్కిల్ 23 టౌన్‌ప్లానింగ్ విభాగంలోని అధికారుల అవినీతిని ఆధారం చేసుకుని బిల్డర్లతోపాటు భవన నిర్మాణదారులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండడంతో అక్రమాలకు అంతే లేకుండా పోయింది. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో అనేక ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాల జోరు పెరుగుతుంది. ఇంటి నిర్మాణాలకు అవసరమైన ప్లాన్ల మంజూరు విషయమై స్పష్టమైన విధానాన్ని అవలంభించకపోవడంతో అక్రమార్కులు యధేచ్ఛగా తమ నిర్మాణాలను నిర్మిస్తున్నారు. ఇప్పటికీ అనేక మంది బిల్డర్లు సర్కిల్ 23 కార్యాలయం నుంచి జ్లీ ప్లస్ టూ త్రీ వరకు అనుమతులు తీసుకుని నాలుగైదు అంతస్తులు నిర్మిస్తున్నారు.

అదే విధంగా రెసిడెన్సియల్ కోసం తీసుకున్న పర్మిషన్‌తో కమర్షియల్ భవనాల్ని నిర్మిస్తున్నారు. టౌన్‌ప్లానింగ్ లొసుగులతో అక్రమ నిర్మాణదారులు డీవియేషన్లకు పాల్పడుతున్నారు. . కొందరు టౌన్‌ప్లానింగ్ అధికారుల అండదండలతో అనేక మంది బిల్డర్లు పార్కింగ్ కోసం కేటాయించిన సెల్లార్లలో అక్రమ నిర్మాణాల్ని చేపట్టారు. అనుమతుల కోసం ముందుగా ప్లాన్‌లో అన్నీ సక్రమంగానే ఉన్నట్లు పేర్కొని భవన నిర్మాణ అనుమతులు పొందిన తర్వాత అందుకు విరుద ంగా వ్యవహరిస్తున్నారు. బిల్డర్లకు సహకరిస్తూ కొందరు అధికారులు, సిబ్బంది అందినంత దండుకుంటున్నారు. గృహ నిర్మాణానికి గాని అపార్ట్‌మెంట్ల నిర్మాణం కోసం వచ్చే దరఖాస్తులను పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా ఉన్న వాటిని మంజూరు చేయడం నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిని తిరస్కరించడం జోనల్ , సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారుల బాధ్యత కాని కొందరు టౌన్‌ప్లానింగ్ అధికారులు లక్షల రూపాయల ముడుపులు మింగి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటికే సహకరిస్తు న్నారు. నిబంధనలను అనుసరించే అమాయకులను మాత్రం తమ చుట్టూ తిప్పుకుంటున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. పెద్దఎత్తున పెరుగుతున్న నిర్మాణాలకు అనుగుణంగా జిహెచ్‌ఎంసి ఆదాయం కూడా పెరుగాల్సి ఉంటుంది. అయితే టౌన్‌ప్లానింగ్ విభాగంలోని కొందరు అధికారులు చేతివాటానికి అలవాటుపడి అక్రమ నిర్మాణాలకు తమ వంతు సహకారం అందించి గ్రేటర్ ఆదాయానికి గండికొడుతున్నారు. అక్రమ నిర్మాణాలు చేపడితే , ముడుపులు అప్పగిస్తేనే అక్రమ నిర్మాణం సక్రమంగా కొనసాగుతుంది. భవన నిర్మాణాల అనుమతులకు ఓ రేటు అ క్రమ నిర్మాణాలకు మరో రేటు వసూలు చేస్తున్న కొందరు అధికారులకు కమర్షియల్ భవనాలు కామధేనువులా మారి రూ. కోట్లు కురిపిస్తున్నాయి. జిహెచ్‌ఎంసి నిబంధనల్ని అతిక్రమించినా సరే కొందరు టౌన్‌ప్లానింగ్ అధికారులు నిర్ణయించిన ముడుపులు ముట్టచెబితే అక్రమ అపార్ట్‌మెంట్లు అయినా, నిర్మాణాలకయినా వెంటనే అధికారుల ఆమోద ముద్రపడుతుంది. దీన్ని బట్టి కొందరు టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు జేబులు నింపుకోవడానికి మాత్రమే పరిమితమవుతున్నారని అర్థమవుతుంది.

**ఏసీపీ కనుసన్నల్లో అక్రమ నిర్మాణాలు..**

**అక్రమ నిర్మాణాలపై అనేక ఫిర్యాదులు వస్తున్నా ఏసీపీ పట్టించుకోకుండా , బడా బిల్డర్లకు తన వంతు సహకారం అందిస్తూ తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అక్రమ నిర్మాణాలు సక్రమంగా కొనసాగేందుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.ఎక్కడ చూసినా కుప్పలు తెప్పలుగా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలను చూస్తే ఏసీపీతోపాటు టౌన్‌ప్లానింగ్ అధికారులపై వస్తున్న ఆరోపణలు నిజమేనని అనిపిస్తోంది. పలు ప్రాంతాల్లో అనేక మంది టీఎస్‌బిపాస్‌తో అనుమతి తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా ఐదారు అంతస్తుల్ని నిర్మిస్తున్నా ఇక్కడ కీలక బాధ్యతల్ని నిర్వహిస్తోన్న ఓ ఏసీపీతో పాటు డిప్యూటీ కమిషనరు, టీపీఎస్‌లు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. నగరానికి ధీటుగా ఇక్కడి స్థలాలకు డిమాండ్ పెరుగడంతో బహుళ అంతస్తుల భవనాలు కుప్పలు తెప్పలుగా వెలుస్తున్నాయి. కమర్షియల్ , బహుళఅంతస్తుల భవనాలు, వ్యక్తిగత గృహాల నిర్మాణాలకు సంబంధించి ఒక్కోదానికి ఒక్కో రేటు కొందరు రూ.కోట్లాది రూపాయలను దండుకుంటున్నారు.**

## హాజ్ యాత్రికులు పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేసుకోవాలి

అడ్డగుట్ట, డిసెంబర్ 12 ప్రభాతవార్త: 2024 సంవత్సరంలో హాజ్ యాత్రకు వెళ్ళే యాత్రికులకు పాస్‌పోస్ట్ వ్యాలిడిటీ కనీసం 31 జనవరి 2025 వరకు ఉండాలని పాస్‌పోర్ట్ అధికారి జె. స్నేహజ తెలిపారు. హాజ్ యాత్రికకుల కోసం పాస్‌పోర్ట్‌ల దరఖాస్తులకు ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ హాజ్ కమిటీ కో అర్డినేషన్‌తో ఈనెల 13, 15, 18 తేదీలలో హాజ్ కమిటీ పర్యవేక్షణలో దరఖాస్తులను రిజనల్ పాస్‌పోర్ట్ కేంద్రంలో ఏర్పాటు చేసే కౌంటర్‌లో స్వీకరించనున్నట్లు, అవకాశాన్ని వినయోగించుకోవాలని కోరారు.

## ట్రైనింగ్‌కు పంపడంలేదని ఒయూలో నిరసనకు దిగిన కానిస్టేబుల్ అభ్యర్థులు

తార్నాక, డిసెంబర్ 12 ప్రభాతవార్త: సెలక్షన్ పూర్తయి రెండు నెలలు గడుస్తున్నా తమను ట్రైనింగ్‌కు పంపించడంలేదని పేర్కొంటు మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ వద్ద సెలక్షన్ పూర్తి అయిన పలువురు కానిస్టేబుల్ అభ్యర్థులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ అభ్యర్థులు మాట్లాడుతూ 2022 ఏప్రిల్‌లో నోటిఫికేషన్ ఇచ్చారని సెలక్షన్ పూర్తి అయి రెండు నెలలు అయ్యిందని వారు తమ ఆవేదనను వెలుబుచ్చారు. ప్రభుత్వం కోర్టు కేసుల పేరుతో తమకు అన్యాయం చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సెలక్ట్ అయిన వారిని వెంటనే ట్రైనింగ్‌కు పంపాలని ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి చొరతతీసుకోవాలని కోరారు.

## భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్య



మృతుడు శివ కిరణ్

పేట్‌బషీరాబాద్, డిసెంబర్ 12, ప్రభాతవార్త : భార్యతో గొడవపడి భర్త ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పేట్ బషీరాబాద్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఫతేనగర్‌కు చెందిన ఝాన్సీ డెలివరీ కోసం పుట్టింటికి వెళ్ళింది. డెలవరీ అయ్యి 3నెలలు కాకముందే ఝాన్సీ భర్త శివ కిరణ్ (31) సోమవారం రాత్రి 8:30కి ఫతేనగర్‌కు వెళ్ళి భార్యను ఇంటికి రమ్మని అడుగగా, 3నెలలు పూర్తి అయిన తరువాత వస్తానని ఝాన్సీ చెప్పడంతో శివ కిరణ్ గొడ వపడి అక్కడి నుంచి వెళ్ళిపోయాడు. కాగా మంగళవారం ఉదయం 7:30గంటలకు తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. భార్య ఇంటికి రాలేదని మనస్థాపం చెంది ఉరి వేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## జీవనోపాధి కోసం వచ్చిన వ్యక్తి హత్యకు గురయ్యాడు

దుండిగల్, డిసెంబర్ 12 ప్రభాతవార్త: గుర్తు తెలియని దుండగుల చేతిలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాకట రాష్ట్రం, గుల్బర్గా జిల్లా, చించోలి మండలం, ఇనోలి గ్రామానికి చెందిన శరణప్ప(60), కోమల దంపతులు కొన్నేళ్ళ క్రితం జీవనోపాధి కోసం నగరానికి వలస వచ్చి దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేట ఇందిరమ్మకాలనీలో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కూతుర్లు ఉండగా పెద్ద కూతురు వివాహం చేశారు. చిన్న కూతురు విద్యనభ్యసిస్తోంది. శరణప్ప ఓ బార్‌లో హౌస్‌కీపర్‌గా పనిచేస్తుండగా కోమల ఓ ఫార్మా కంపెనీలో హౌస్‌కీపర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని వెళ్లదీసుకుంటున్నారు. ఈక్రమంలో ఈరోజు ఉదయం 9:30గంల ప్రాంతంలో టీ తాగివస్తానంటూ ఇంటి నుండి బయటకు వెళ్ళిన శరణప్ప తిరిగి ఇల్లు చేరుకోలేదు. మధ్యాహ్నం సమయంలో భౌరంపేట పరిధి లహరి వెంచర్‌లోని చెట్ల పొదల్లో వ్యక్తి మృతదేహాన్ని గమనించిన స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. మృతుడి తలపై బలమైన గాయాలు ఉండడంతో హత్యకు గురైనట్లు నిర్ధారించుకొని క్లూస్‌టీమ్, డాగ్‌స్క్వాడ్‌తో ఆధారాలు సేకరించారు. హత్యకు గురైన వ్యక్తి ఇందిరమ్మకాలనీకి చెందిన శరణప్పగా గుర్తించారు. మృతుడి బార్య కోమలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని అన్ని కోణాల్లో దర్యాప్తును వేగవంతం చేశారు.

## టిఎస్‌పిఎస్‌సి చైర్మన్ జనార్ధన్‌రెడ్డి రాజీనామాతో నిరుద్యోగుల సంబురాలు



చిక్కడపల్లి, డిసెంబరు 12 ప్రభాతవార్త: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ పదవికి జనార్ధన్‌రెడ్డి రాజీనామా చేయడంతో అశోక్‌నగర్‌లో నిరుద్యోగులు పెద్దఎత్తున సంబురాలు జరుపుకున్నారు. మంగళవారం అశోక్‌నగర్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి,ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ రియాజ్ హాజరై నిరుద్యోగ యువతీ యువకులతో ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రియాజ్ మాట్లాడుతూ జనార్ధన్‌రెడ్డి 2021లో టిఎస్‌పిఎస్‌సి చైర్మన్‌గా నియమితులయ్యారని, కెసిఆర్ హయాంలో టిఎస్‌పిఎస్‌సి నిర్వహించిన పరీక్షలలో పేపర్ లీక్, పరీక్షల వాయిదాలతో విద్యార్థుల ఆందోళనకు గురైనా కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. అంతేకాకుండా నిరుద్యోగ యువతీ యువకులు కొంత మంది ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనలు కూడా ఉన్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే ప్రభుత్వం టిఎస్‌పిఎస్‌సి పరీక్షలను రీషెడ్యూల్ చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నిరుద్యోగ యువత అంతా టిఎస్‌పిఎస్‌సి పూర్తి ప్రక్షాళన చేయాలని, వెంటనే ఉద్యోగాల భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

## 15 నుంచి నాణేలు, స్టాంప్‌ల ప్రదర్శన

సైఫాబాద్, డిసెంబరు 12 ప్రభాతవార్త:ప్రజల్లో నాణేలపైన, పోస్టల్ స్టాంప్‌లపై అవగాహన కల్పించడానికి ఈ నెల 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఫ్యాప్సీ భవన్‌లో ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నామని ది హైదరాబాద్ ఫిలాథెలిక్ అండ్ హాబ్బీస్ సొసైటి తెలిపింది. మంగళవారం ఎస్ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సొసైటి కార్యదర్శి సాగి శ్రీనివాస్‌రాజు, సభ్యులు విద్యాసాగర్‌రెడ్డి, జయదేవ్ తదితరులు మాట్లాడుతూ చోళుల కాలం నాటి నుంచి నేటి వరకు వచ్చిన నాణేలు, కరెన్సీ, అలాగే 1854 నుంచి నేటి వరకు వచ్చిన స్టాంప్‌ల ప్రదర్శన జరుగుతుందన్నారు. అలాగే 300 నుంచి, 400 మంది విద్యార్థులకు నాణేలు, పోస్టల్ స్టాంప్‌లపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమం లో ముఖ్యఅతిధులుగా చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్స్ పి.విద్యాసాగర్‌రెడ్డి, శ్రీలత పాల్గొంటారన్నారు.

## అంగన్‌వాడీ ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కారిస్తాను

**రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క హామీ**



రాష్ట్ర మంత్రి సీతక్కను సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నందూరి కరుణకుమారి

సైఫాబాద్, డిసెంబరు 12 ప్రభాతవార్త: అంగన్‌వాడీ ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ప్రతినిధి బృందం రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం డైరెక్టర్ కార్యాలయంలో మంత్రికి అసోసియేషన్ ప్రతినిధి బృందం వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో నీతిగా, నిజాయితిగా, నిస్వార్థంగా మహిళలు, బాలల పట్ల ప్రత్యేకమైన శ్రద్ద తీసుకుని పనిచేయాలని అంగన్‌వాడీ ఉద్యోగ, కార్మికులను కోరారు. ఉద్యోగుల, కార్మికుల సమస్యలను పరిష్కారిస్తామని మంత్రి వారికి హామీ ఇచ్చారు. అసోసియేషన్ కోశాధికారి, మేడ్చల్ జిల్లా పర్వాదిగూడ అంగన్‌వాడీ సెంటర్‌లో 40 మంది పిల్లలకు, గర్భవతులకు పౌష్టికాహారం, ఇమినైజేషన్‌ను ఆదర్శవంతగా నిర్వహిస్తున్న ప్యారీజాన్ సేవలను ప్రభుత్వం గుర్తించిందని మంత్రి సీతక్క ఆమెను ఘనంగా సత్కరించారు. తొలుత మంత్రి సీతక్కను అసోసియేషన్ ప్రతినిధి బృందం సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు సుచిత్ర, రమ, ధనలక్ష్మి, అయిలమ్మ, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

## నేడు నగరానికి శ్రీరామామృత తరంగిణి రథయాత్ర

హైదరాబాద్, డిసెంబరు 12,ప్రభాతవార్త: తత్వఛారిటబుల్ ట్రస్ట్, శ్రీరామా అమృత తరంగిణి ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంతో గతరెండు సంవత్సరాల నుంచి అనేక అధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ట్రస్ట్ చైర్మన్ పసర్లపాటి శ్రీనివాస్, బంగారయ్య శర్మ తెలిపారు. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వచ్చే సంవత్సరం జనవరి నెలలో ఉత్తరప్రదేశ్‌లోని అయేధ్య పట్టణంలో భవ్య రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని తమిళనాడు, కర్ణాటక, కేరళలో ఇప్పటివరకు 75లక్షల ఇళ్లకు వరకు 16నదులకి చెందిన మట్టితోపాటు పవిత్ర నదుల తీసుకుని వస్తున్న శ్రీరామామృత తరంగిణి రథయాత్ర నేడు నల్లకుంటలోని శంకర్‌మఠ్‌కు చేరుకుంటుందన్నారు. బుధవారం ఈజలాలను దర్శించే అవకాశం రేపు సాయంత్రం వరకు భక్తులకు కల్పిస్తున్నామన్నారు. నెలరోజులపాటు తెలుగు రాష్ట్రాల్లో ఊరేగించిన అనంతరం అదే మట్టిని, నీటిని అయోధ్యకు తీసుకువెళ్ళి రాములవారికి సమర్పిస్తామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో అమోద దేశపతి, కళ్యాణ్, భీమ్‌సేన్‌మూర్తి, సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## 16న గిరిజన ఎమ్మెల్యేలకు ఆత్మీయ సత్కార సభ

**గిరిజనశక్తి అధ్యక్షులు కొర్ర శరత్‌నాయక్**



సమావేశంలో అభివాదం చేస్తున్న శరత్‌నాయక్, చందా మహేష్, ప్రకాశ్ రాథోడ్ తదితరులు

హైదరాబాద్, డిసెంబరు 12,ప్రభాతవార్త: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన 12మంది గిరిజన ఎమ్మెల్యేలను ఈనెల 16న రవీంద్రభారతిలో గిరిజన, ఉద్యోగ, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారసభను ఏర్పాటు చేసినట్లు గిరిజనశక్తి అధ్యక్షులు కొర్ర శరత్‌నాయక్ తెలిపారు. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ..గిరిజన జాతి ప్రజాప్రతినిధులను సత్కరించుకోవాలనే ఉద్దేశ్యంతో ఈకార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే గెలుపొందిన ఎమ్మెల్యేలు గిరిజన జాతి అభివృద్ధి కోసం పాటుపడాలని కోరారు. అన్ని గిరిజన సంఘాలు, ఉద్యోగుల, విద్యార్థులు మేధావులు ఏకతాటిపైకి వచ్చిన ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దీనికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టివిక్రమార్కలతోపాటు అన్ని శాఖల మంత్రులను ఆహ్వానించామన్నారు. ఈకార్యక్రమంలో అదివాసి గిరిజన విద్యార్థి సంఘం అధికార ప్రతినిధి చందా మహేష్, ఐఆర్ఎస్, ఇన్‌కమ్‌టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ ప్రకాశ్ రాథోడ్, రిటైర్డ్ ప్రొఫెసర్ రాంకోటి, ఉస్మానియా యూనివర్సిటీ ఫ్యాకల్టీ అర్జున్‌రావు కూతాడి పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

**చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ముజీబుల్లా షరీఫ్**

చార్మినార్,డిసెంబరు 12 ప్రభాతవార్త : కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ముజీబుల్లా షరీఫ్ అన్నారు.రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన రాష్ట్ర సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువ కప్పి శుభాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రవేశ పెట్టిన ఆరు గా ్యరంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండ అమలు చేస్తుందని తెలియజేశారు.పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# చాపకింద నీరులా న్యుమోనియా

**- నిలోఫర్‌కు పెరుగుతున్న రోగులు**

**- 60కి పెరిగిన రోగుల సంఖ్య**

**- 5 సంవత్సరాలలోపు పిల్లలే మృత్యువాత**







మెహిదీపట్నం, డిసెంబర్ 12, ప్రభాతవార్త : వాతావరణంలో ఉష్ణోగ్రతలు తగ్గి చలిగాలు వీస్తుండడంతో చిన్నపిల్లల్లో న్యూమోనియా వ్యాధి చాపకింద నీరులా విస్తరిస్తుంది. ఒకరి నుంచి మరొకరికి వ్యాధి విస్తరిస్తుండడంతో వ్యాధి బారిన పడ్డుతున్న చిన్నపిల్లల సంఖ్య రోజు రోజుకు పెరుగుతంది. దీంతో చిన్నపిల్లల తల్లిదండ్రులు ఆందోళనలకు గురవుతున్నారు. నగరంలో చిన్నపిల్లల ఆసుపత్రిగా పేరుగాంచిన నీలోఫర్‌కు రోగుల తాకిడి పెరగడంతో ఆసుపత్రిలో వైద్యులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. చలి గాలులు, చల్లని వాతావరణంతో చంటి పిల్లలకు శ్వాసకోస, అస్తమా, న్యూమోనియా వ్యాధులు సోకుతుండడంతో ఇప్పటికి వరకు నీలోఫర్ ఆసుపత్రిలో చేరిన వారి సంఖ్య 60కి చేరింది. జలుబు, దగ్గు, జ్వరం, ఒళ్లు నొప్పులతో చికిత్స కోసం ఎక్కువగా చిన్నారులు వస్తుండడంతో పాటు 5-6 రోజుల నుంచి జ్వరం తగ్గకపోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఉంటే న్యూమోనియాగా గుర్తించి ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. వ్యాధిసోకి మృత్యువాత పడుతున్న చిన్నారులు 5 సంవత్సరాలలోపే ఎక్కువగా ఉంటున్నారు.

**వ్యాధి లక్షణాలు.** జలుబు, జ్వరం, దగ్గు, ఒళ్ళు నొప్పులు, వేగంగా శ్వాస తీసుకోవడం, చాతి ఎగరేయడం, పాలు తాగకపోవడం, విరేచనాలు, పెదాలు నీలిరంగుగా మారడం.

**చంటి పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి**

**నీలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి**



చంటి పిల్లలు ఉన్న తల్లిదండ్రులు ఈ సీజన్‌లో చిన్నారులపై ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలి. ఆర్‌వీఎస్, ఫ్లూ - వైరస్, నిమోకోకస్, హెచ్ నిఫ్లూయాంజా ద్వారా న్యూమోనియా వ్యాధి సోకుతుంది. 5 సంవత్సరాలలోపు ఉన్నటువంటి చిన్నపిల్లలకు జలుబు, జ్వరం ఎక్కువగా శ్వాసతీసుకోవడం, చాతి ఎగరవేయడం, పాలు తాగక పోవడం, విరేచనాలు కావడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్‌ని సంప్రదించాలి. చిన్నారులకు చల్లటి గాలులు తాకకుండా చూసుకోవడంతో పాటు వెచ్చదనాన్ని అందించాలి. తల్లి తన బిడ్డను ఛాతీపై పడుకోబెట్టుకొని ఉంచడం వల్ల తల్లి శరీర ఉష్ణోగ్రతలు చిన్నారిని కాపాడుతాయి.

## హైదరాబాద్ నగరం విభిన్న సంస్కృతుల నిలయం

**ఎమ్మెల్యే కెపి వివేకానంద**

జీడిమెట్ల, డిసెంబర్ 12, ప్రభాతవార్త : 130 సుభాష్‌నగర్ డివిజన్‌లోని ఫాక్స్ సాగర్ వద్ద గల రాధాకృష్ణ దేవాలయంలో సోమవారం సాయంత్రం ఒడియా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కెపి వివేకానంద ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి వివేకానంద మాట్లాడుతూ హైదరాబాద్ నగరం విభిన్న సంస్రృతుల నియలమని, ఇక్కడ జీవించేవారు అందరూ తెలంగాణ వారితో సమానమని అన్నారు. అనంతరం ఒడియా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ఇక్కడ ఎమ్మెల్యే కెపి వివేకానంద సహాయ సహకారాలతో దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలు సుఖ సంతోషాలతో జీవిస్తున్నారని అన్నారు. ఈ రాధాకృష్ణ దేవాలయం నిర్మాణంలో సహాయ, సహకారాలు అందించిన ఎమ్మెల్యే కెపి వివేకానందకు కృతజ్ఞతలు తెలిపారు. తదనంతరం ఎమ్మెల్యే వివేకానందను ఒడియా అసోసియేషన్ సభ్యులు శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలియజేశారు.

## పారిశుద్ధ్య పనులను సందర్శించిన సన్న శ్రీశైలం యాదవ్



కొంపల్లి, డిసెంబర్ 12, ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం చైర్‌పర్సన్ సన్న శ్రీశైలంగ యాదవ్ పలువురు కౌన్సిలర్లతో కలిసి కొంపల్లి పురపాలక సంఘం పరిధిలో గల 1, 2, 3వ వార్డులలో పారిశుధ్య పనులను సందర్శించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు తగు ఆదేశాలను జారీ చేయడం జరిగింది.

## కాబోయే స్పీకర్ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



నిజాంపేట్, డిసెంబర్ 12, ప్రభాతవార్త : రాష్ట్ర సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టెక్స్‌టైల్స్ మంత్రిగా సేవలు అందించి, ప్రస్తుతం వికారాబాద్ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా గెలిచిన, తెలంగాణ స్పీకర్ అభ్యర్థి గడ్డం ప్రసాద్ కుమార్‌ను వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రసాద్ కుమార్‌ను శ్రీనివాస్‌రెడ్డి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూలకంటి లక్ష్మారెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## టై గ్రాడ్ ప్లస్ కోసం టై హైదరాబాద్‌తో వీఎన్ఆర్ విజెఐఈటి అవగాహన ఒప్పందం

నిజాంపేట్, డిసెంబర్ 12, ప్రభాతవార్త : వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల టై గ్రాడ్ ప్లస్ కార్యక్రమానికి నాంది పలుకుతూ టై హైదరాబాద్ ఛాప్టర్‌తో మంగళవారం అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ కార్యక్రమంలో టై గ్రాడ్ ప్లస్ గ్లోబల్ చైర్‌పర్సన్ డా.భానుప్రకాశ్ వర్మ, సహ చైర్‌పర్సన్ డా.బాలాజీ భైరవభట్ల, సిల్వర్‌నీడిల్స్ వెంచర్స్ సంస్థ వ్యూహాత్మక సలహాదారు, వెంచర్ పార్ట్‌నర్ వివేక్‌వర్మ, సింప్లీబిజ్ అంకురసంస్థ వ్యవస్థాపకులు రఘుబాబు గుంటూరులతో సహా కళాశాల తరపు నుంచి ప్రధానాధ్యాపకులు డా.సి.డి.నాయుడు, సంచాలకులు డా.బి.చెన్నకేశవరావు, విద్యార్థి పురోగతి డీన్ డా.వై.పద్మశాయి, స్టార్టప్ కార్యకలాపాల సమన్వయకర్త, విజెహబ్ మేనేజర్ డా.చక్రవర్తుల కిరణ్ పాల్గొన్నారు. టై గ్రాడ్ ప్లస్ కార్యక్రమంలో వీఎన్ఆర్ విజెఐఈటి కళాశాల విద్యార్థులకి మెంటార్లుగా వ్యవహరించనున్న వివేక్‌వర్మ, రఘుబాబు గుంటూరు మాట్లాడుతూ విద్యార్థులకు అంకురస్థాపనని తమ కెరియర్‌గా ఎందుకు ఎంచుకోవాలో చెబుతూ ఈ రంగంలో జరుగుతున్న వృద్ధిని ప్రస్తావించారు.

## ధీరజ్ సాహు అక్రమ సంపాదనపై రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలి: బీజేపీ



ఆందోళన చెస్తున్న బీజేపీ నేతలు

కంటోన్మెంట్, డిసెంబర్ 12 ప్రభాతవార్త: బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి పిలుపు మేరకు కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహు అక్రమ సంపాదనకు వ్యతిరేకంగా మంగళవారం సికింద్రాబాద్ జేబీఎస్ వివేకానంద విగ్రహం వద్ద బీజేపీ నేతలు నిరసన కార్యాక్రమం చేపట్టారు. కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు ధీరజ్ సాహు ఇంట్లో బయటపడ్డ అక్రమ సంపాదనపై రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని ఈ కార్యాక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కంటోన్మెంట్ బీజేపీ ఇంచార్జి శ్రీగణేష్ డిమాండ్ చేశారు. దేశం నివ్వేరపోయేటట్లు కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహు వద్ద పట్టుబడ్డ రూ. 500 కోట్లు అక్రమ సంపాదనపై స్పందించాలన్నారు. ఈ కార్యాక్రమంలో బీజేపీ నేతలు పరశురామ్, బీఎన్ శ్రీనివాస్, గోపి శంకర్, విజయనందు, సతీష్, జేపీ నర్సింగ్‌రావు, బొట్టు శంకర్, రాజు, మల్లేష్, విజయ్, అజయ్, ప్రశాంత్, కిరణ్, వీరు, సరిత, భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు.

## మహాలక్ష్మి పథకానికి విశేష స్పందన

మెహిదీపట్నం, డిసెంబర్ 12, ప్రభాతవార్త : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకానికి మహిళల నుంచి విశేష స్పందన లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గ ఏ-బ్లాక్ అధ్యక్షులు కూరాకుల కృష్ణ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో గడీల పాలన పోయి ప్రజా పాలన వచ్చిందన్నారు. మంగళవారం కార్వాన్‌లోని కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు ఆర్టీసీ బస్సులో ప్రయాణించి మహిళలకు మహాలక్ష్మి పథకం టికెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కూరాకుల కృష్ణ మాట్లాడుతూ..తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండురోజుల్లోనే రెండు పథకాలను ప్రవేశపెట్టిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దక్కుతుందన్నారు. త్వరలోనే ఆరు గ్యారంటీ పథకాలను ప్రవేశ పెట్టి తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని తెలిపారు. ప్రజా రంజక పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. మహాలక్ష్మి పథకంతో మహిళలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. ఆయన వెంట నాయకులు ఆకుల చంద్రశేఖర్,గజిరె కిషన్, హాబీబ్‌లు ఉన్నారు.

## ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్‌కు సన్మానం



మెహిదీపట్నం, డిసెంబర్ 12, ప్రభాతవార్త : కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ హ్యాట్రిక్ విజయం సాధించి మొదటి సారి కార్వాన్ డివిజన్ లో పర్యటిం చడంతో మంగళవారం కార్వాన్ డివిజన్‌కు చెందిన మజ్లిస్ పార్టీ నాయకులు బాలాజీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కౌసర్‌కు శాలువాకప్పి అభినందనలు తెలిపారు. అనంతరం కౌసర్ మోహియుద్దీన్ మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతోనే తనను మూడు సార్లు గెలిపించడం జరిగిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకెల్లడం జరుగుతుందన్నారు. బస్తీలు, కాలనీలలో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. సన్మానించిన వారిలో మజ్లిస్ పార్టీ సీనియర్ నాయకులు ముస్తాఫా, గౌస్, జావిద్, ఇమ్రాన్, ఆమేర్, సాజిద్, వాజిద్‌లు ఉన్నారు.

### నిరుద్యోగులను మోసం చేసిన ఘనత కల్వకుంట్ల కుటుంబానిదే

చిక్కడపల్లి, డిసెంబరు 12 ప్రభాతవార్త: తెలంగాణ వస్తే ఉద్యోగాలు వస్తాయని ఆశలు పెట్టుకున్న నిరుద్యోగులను మోసం చేసి టిఎస్‌పిఎస్‌సిలో జరిగిన అవకతవకలను పేపర్ లీకేజీ చేసిన అధికారులను కాపాడుతున్న ఘనత కల్వకుంట్ల కుటుంబం, గత ప్రభుత్వానిదేనని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

## చేనేతలను ప్రోత్సహించాలి : రష్మీ ఠాకూర్

హైదరాబాద్, డిసెంబరు 12,ప్రభాతవార్త: చేనేతను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని ఇండి యన్ సిల్క్ గ్యాలరీ ఎగ్జిబిషన్‌లోని వస్త్రాలు మగువల మనసును దోచుకునేలా ఉన్నాయని మిస్ ఏషియా ఇంటర్నేషనల్ నటి రష్మి ఠాకూర్ పేర్కొన్నారు. శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరుతో ఏర్పాటు చేసిన చేనేత ఎగ్జిబిషన్‌ను రష్మీఠాకూర్ సందర్శించారు. నాణ్యమైన చీరలకు చిరునామాగా ఇండియన్ సిల్క్ గ్యాలరీ అని పేర్కొన్నారు. ఎగ్జిబిషన్‌లోని చీరను చూసి చేనేత కళాకారుల ప్రతిభను ప్రశంసించారు. దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కళాకారులు వారి ఉత్పత్తులను సుమారు 70స్టాల్స్ ఏర్పాటు చేశామని నిర్వాహకులు వినయ్‌కుమార్, శ్రీనివాస్‌రావు తెలిపారు. చెందేరి, జార్ఖండ్, ఇక్కత్, పోచంపల్లి, నారాయన్‌పేట్, బెనారస్, కోల్‌కతాకు చెందిన విభిన్నమైన అరుదైన చీరలను ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 14వరకు ఈఎగ్జిబిషన్ వినియోగదారులు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

## ఘనంగా భ్రమరాంబదేవి సమేత చెన్న మల్లిఖార్జున స్వామి బ్రహ్మోత్సవాలు

చార్మినార్, డిసెంబరు 12 ప్రభాతవార్త : పాతబస్తీ చాంద్రయణగుట్ట కేశవగిరిలోని శ్రీశ్రీశ్రీ భ్రమరాంబదేవి సమేత శ్రీ చెన్న మల్లిఖార్జున స్వామి దేవ స్థానంలో మూడు రోజులు పాటు అత్యంత వైభంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నామని ఆలయం నిర్వాహకులు కోటి అనిల్ కుమార్,కోటి హరీష్ కుమార్‌లు తెలిపారు.15వ తేదీన శ్రీ చెన్న మల్లిఖార్జున స్వామి భ్రమరాంబ దేవిసు ప్రభాత సేవ,గణపతి పూజ,16వ తేదీన వాస్తు హోమం,రుద్ర హోమం,మూర్తి హోమం,మూల మంత్ర హోమములు,సాంస్కృతిక కార్యక్రమాలు,17వ తేదీన రుద్ర హోమం,పూర్ణాహుతి,బలిహరణ,అన్న ప్రసాద వితరణ, సాయంత్రం 5 గంటలకు శ్రీశ్రీశ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి వారి కళ్యాణం అనంతరం శ్రీశ్రీశ్రీ భ్రమరాంబదేవి సమేత శ్రీ చెన్న మల్లిఖార్జున స్వామి వారి కళ్యాణ మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని వారు తెలియజేశారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం రావడానికి మహిళా కాంగ్రెస్ చేసిన పోరాటం ఎంతో ఉంది

చిక్కడపల్లి, డిసెంబరు 12 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో గతంలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం అవలంభించిన ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేయడం జరిగిందని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పుస్తకాల కవిత అన్నారు. గాంధీనగర్ విలేకరులతో పుస్తకాల కవిత మాట్లాడారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు సూచనల మేరకు గతంలో ఇక్కడ అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వివిధ రూపాలలో ఆందోళనలు చేయడం జరిగిందన్నారు. దాదాపు 240 ధర్నాలు, వివిధ రూపాలలో ఆందోళనలు చేశామన్నారు. రాష్ట్రంలో తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం 10 సంవత్సరాల తర్వాత ఏర్పడిందని, సిఎం రేవంత్‌రెడ్డి మహిళా కాంగ్రెస్ చేసిన కృషికి ఫలితంగా కార్పొరేషన్ చైర్‌పర్సన్, కమిటీ సభ్యుల నియామకాలలో అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. గత కొన్ని దశాబ్దాల నుంచి మహిళా కాంగ్రెస్ ఎన్నో పోరాటాలు చేసిందని, తెలంగాణ రాష్ట్ర సాధనకో ఎంతో కృషి చేసిన విషయాన్ని పుస్తకాల కవిత గుర్తు చేశారు.

## చంద్రబాబు, కెసిఆర్‌ను పరామర్శించటం అభినందనీయం

**టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా**



ముషీరాబాద్, డిసెంబర్ 12, ప్రభాత వార్త: రాజకీయంగా విభేధాలున్నప్పటికీ అవి వ్యక్తిగతంగా ఉండ కూడదనే సదుద్దేశ్యంతో యశోదా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను టీడీపీ అధి నేత చంద్రబాబునా యుడు పరామర్శిం చటం అభినందనీయమని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా అన్నారు. మంగళవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనతో రాజకీయ సహచరుడిగా పనిచేసిన మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ అస్వస్థతకు గురైన విషయం తెలిసి మానవతా దృక్పథంతో చంద్రబాబు నాయుడు పరామర్శించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకోవటం పట్ల తెలుగుదేశం పార్టీ నాయకులుగా హర్షం వ్యక్తం చేస్తున్నామని అన్నారు. రాజకీయాలలో ఆరోగ్యకరమైన వాతా వరణం నెలకొల్పి, రాజకీయాలను ఆరోగ్యవంతంగా మార్చేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. గతంలో చంద్రబాబునాయుడు అరెస్ట్ అయినప్పుడు కేసీఆర్ ఏ మాత్రం స్పందించక పోయినా ఎటువంటి రాగద్వేషాలు పెట్టుకోకుండా ఉన్నతమైన విలువలతో ఈరోజు కేసీఆర్ ను పరామర్శించటం విలువలతో కూడిన రాజకీయాలకు నిదర్శనమని, అన్ని రాజకీయపార్టీల నాయకులు దీనిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, బాలరాజ్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శి కప్పు కృష్ణగౌడ్, జి.యాదగిరిరావు, ఎస్.ప్రకాష్, యాదగిరి పాల్గొన్నారు.

## వైవిధ్యభరితంగా ఆటా అంతర్జాతీయ సాహితీ సదస్సు

నాంపల్లి, డిసెంబరు 12 ప్రభాతవార్త : అమెరికా తెలుగు సంఘం ఆటా వేడుకల్లో భాగంగా నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో ఆటా సాహిత్య ప్రయాణం-శ్రవణం-భాషణం-పఠనం-లేఖనం ప్రధానాంశాలుగా ఆటా అంతర్జాతీయ సాహితీ సదస్సు-2023 వైభవంగా వైవిధ్యభరితంగా నిర్వహించనున్నట్లు ఆటా అధ్యక్షురాలు మధు బొమ్మినేని, అధ్యక్షుడు, వేడుకల చైర్ ఎలెక్ట్ జయంత్ చల్లా, కోచైర్ వేణు సంకినేని, లిటరరీ కమిటీ చైర్ వేణు నక్షత్రం, రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ నెల 17 ఆదివారం ఉదయం 9.30 నుండి రాత్రి వరకు జరిగే ఈ వేడుకల ప్రారంభోత్సవం శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు కొలకలూరి ఇనాక్ సభాధ్యక్షతన ముఖ్యఅతిథిగా నందిని సిధారెడ్డి సదస్సును లాంఛనంగా ప్రారంభిస్తారని; తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు అధ్యక్షతన జరిగే ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జూలూరి గౌరీశంకర్, మంత్రి శ్రీదేవి, విశిష్ట అతిథులుగా యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా జరిగే సాహిత్య కార్యక్రమాల్లో శాంతిస్వరూప్, ఐనంపూడి లక్ష్మి, జె.శ్రీనివాస్, సంగిశెట్టి శ్రీనివాస్, స్వామి ముద్దం, జెఎల్.నరసింహారెడ్డి, నలిమెల భాస్కర్, దెంచనాల శ్రీనివాస్, కొలకలూరి మధుజ్యోతి, నరాల రామిరెడ్డి, కొండపల్లి నీహారిణి, టి.గోపాల్‌రెడ్డి, మధురాంతకం నరేంద్ర, మధుబాబు, పి.అశోక్‌కుమార్, వెంకట్రామిరెడ్డి, మహ్మద్‌గౌస్, హుమయూన్ సంఘీర్, పత్తిపాక మోహన్, ఎస్వీ సత్యనారాయణ, మువ్వా శ్రీనివాసరావు, నాళేశ్వరం శంకరం, ఏనుగు నరసింహారెడ్డి, ఎం.హైమవతి, కందుకూరి శ్రీరాములు, జల్లేపల్లి బ్రహ్మం, యాకూబ్, వెల్దండి శ్రీదర్, రవీందర్, గోరేటి వెంకన్న, సుద్దాల అశోక్‌తేజ, దేశపతి శ్రీనివాస్, పెంచలదాస్, రామప్రసాదరెడ్డి, బలగం వేణు, అల్లాణి శ్రీధర్, మామిడిహరికృష్ణ, మహ్మద్ షరీఫ్ తదితరులు పాల్గొంటారని వారు వివరించారు.

## పెండింగ్‌లో ఉన్న సీవరేజ్, మంచినీటి సమస్యల పరిష్కారానికి చర్యలు

**వాటర్‌బోర్డు ఎండిని కలిసిన కార్పొరేటర్ పావనీ వినయకుమార్**

చిక్కడపల్లి డిసెంబరు 12 ప్రభాతవార్త: పెండింగ్‌లో ఉన్న సీవరేజ్, మంచినీటి సరఫరా సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ మెట్రోవాటర్‌సీవరేజ్ బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ దానకిషోర్‌ను బిజెవైఎం పూర్వ జిల్లా అధ్యక్షుడు ఎ.వినయకుమార్‌తో కలిసి కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ వినతిపత్రాన్ని సమర్పించారు. డివిజన్ పరిధిలో నూతన పైప్‌లైన్ పనులు పూర్తి చేయాలని, అదే విధంగా పెండింగ్‌లో ఉన్న కలుషిత, మంచినీటి సరఫరా సమస్య, నూతన పైప్‌లైన్ నిర్మాణం వంటి అభివృద్ధి పనులను త్వరలో ప్రారంభించాలని కోరారు. వెంటనే స్పందించిన వాటర్‌బోర్డు ఎండి దానకిషోర్ సంబంధిత అధికారులకు ఆదేశాలను జారీ చేసి పనులను త్వరితగతిన పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు.

### రామ్‌నగర్‌లో కార్పొరేటర్ పాదయాత్ర

చిక్కడపల్లి, డిసెంబరు 12 ప్రభాతవార్త: రామ్‌నగర్ డివిజన్‌లోని హరినగర్ వైట్‌హౌజ్ వద్ద స్థానికుల అభ్యర్థన మేరకు నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేసే కార్యక్రమం పూర్తి చేసినట్లు స్థానిక కార్పొరేటర్ రవిచారి అన్నారు. మంగళవారం హరినగర్ వైట్‌హౌజ్ వద్ద మంచినీటి పైప్‌లైన్ పగిలిపోయిన విషయాన్ని స్థానికులు కార్పొరేటర్ రవిచారి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించి వాటర్ బోర్డు డీజీఎం మోహన్‌రావు సమాచారం అందించారు. పరిస్థితిని పరిశీలించిన అనంతరం అధికారులు వెంటనే నూతనంగా పైప్‌లైన్ వేయడం జరిగింది.

### కేసీఆర్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే



కంటోన్మెంట్, డిసెంబర్ 12 ప్రభాతవార్త: సోమాజీ గూడ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ సీఎం కేసీఆర్‌ను కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత మంగళవారం పరామర్శించారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## బహుముఖ ప్రజ్ఞాశాలి కట్టమంచి రామలింగారెడ్డి



కట్టమంచి రామలింగారెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించిన దృశ్యం

చిక్కడపల్లి, డిసెంబరు 12 ప్రభాతవార్త: బహుముఖ ప్రజ్ఞాశాలి కట్టమంచి రామలింగారెడ్డి అని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త అన్నారు. మంగళవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో శతాబ్దిపూర్వ మహనీయుల యాదిలో కార్యక్రమంలో భాగంగా బహుముఖ ప్రజ్ఞాశాలి కట్టమంచి రామలింగారెడ్డి జయంతి కార్యక్రమం గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తి అధ్యక్షత జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఉప్పల శ్రీనివాస్‌గుప్త మాట్లాడుతూ కవిగా కట్టమంచి వారిది విశిష్టమైన శైలి అని, 19 ఏళ్ళ వయస్సులోనే ఖండకావ్యంగా 'ముసలమ్మ మరణం' రచించారని అన్నారు. తన రచనల ద్వారా అన్ని తరాలకు ఆదర్శంగా నిలిచారని అన్నారు 1926లో స్థాపించిన ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ప్రథమ వైస్‌చాన్సలర్‌గా నియమితులై వర్సిటీకి మంచి పేరు సంపాదించి పెట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీకిరణం పత్రిక సంపాదకులు పొత్తూరి సుబ్బారావు, కథక్ నాట్యగురువు, ఫిలిం సెన్సార్‌బోర్డు సభ్యుడు పండిట్ అంజుబాబు, గానసభ పాలకమండలి సభ్యుడు బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ సిఎం, రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి భట్టివిక్రమార్కను కలిసి అభినందనలు తెలిపిన టిఎస్ఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, మధన్‌మోహన్‌రావు, పర్వతం, రాములు తదితరులు


**VAARTHA CLASSIFIEDS**

**CHANGE OF NAME**

★ CH. SUVARNA D/o CH. Hariprasad Rao, R/o H.No.3-62, New Damarajapalle(V), Mallapur (M), Jagtial District (T.S.), shall henceforth be known as BALYAPALLI BHUVANESHWARI W/o BALYAPALLI SHASHIKANTHA SHARMA to Marriage.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవసలిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC

టెండర్ ప్రకటన

నిటి నం.37/SE(M)/SBZ/GHMC/2023-24, తేది: 12.12.2023, పని యొక్క పరిధి: సికింద్రాబాద్ కొత్త బోయిగూడ వద్ద ఆధునిక జంతు వధశాల ఆపరేషన్ మరియు నిర్వహణ (O&M) (రీకాల్), బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీలు/సమయం: వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడబుల్ RFP (తేదీ, సమయం): 13.12.2023 మ.1.00 గం. GHMC సికింద్రాబాద్ జోన్, సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం వద్ద ప్రీ-బిడ్ సమావేశం: 16.12.2023 మ.3.00 గం., బిడ్ దాఖలుకు చివరి తేది: 20.12.2023 మ.1.00 గం. అధికారి పేరు, కార్యాలయ చిరునామా, ఫోన్ నం: SE, సికింద్రాబాద్ జోన్, GHMC, సెల్ నం: 9989930374. తదుపరి వివరాలు వెబ్‌సైట్: www.tender.telangna.gov.in వద్ద చూడవచ్చును.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, సికింద్రాబాద్ జోన్, GHMC

DIPR.No.8592-PP/CL/Advt/1/2023-24, తేది: 12.12.2023

**IN THE COURT OF THE HON'BLE VII JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS, AT: HYDERABAD**
**O.S.No. 4218 OF 2022**

Between :-
**M/s. CANARA BANK (E-Syndicate Bank),** 18-A, Opp. SR Nagar Reading Library, Vengal Rao Nagar, Hyderabad-38. ...Plaintiff
A N D
**Mr. Alajangi Trinadha and another** ...Defendants

To,
**1. Mr. Alajangi Trinadha,** S/o. Ramulu, Age: 34 years, Occ: Employee
**2. Sri Gadi Raju,** S/o. Tirupathi, Age: 34 years, Occ: Employee
Both 1 & 2 are R/o. H.No. 7-1-309/13, BK Guda, Hyderabad-500038.

Sir,
Take Notice that the Canara Bank, Vengal Rao Nagar Branch has filed a Suit against you for recovery of amount of **Rs. 1,75,249.54 ps.** The matter is posted on **10-01-2024,** for your appearance make it convenient to appear before the Hon'ble Court personally or through duly instructed counsel to answer the claim at **10.30 AM.** Failing which the matter shall be decided on the material available.

**// BY THE ORDER OF THE HON'BLE COURT //**
Sd/- **M/s. SANGEETA JAISWAL,** Advocate, # 12-8-170, Mettuguda, Secunderabad.

**IN THE COURT OF THE HON'BLE VII JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS AT HYDERABAD**
**O.S.No. 3354 of 2022**

Between:
**Canara Bank,** Chikkadapally Branch, Hyderabad ...**Plaintiff**
And
**M/s Veesoft Technologies** ...**Defendant**

To,
**M/s Veesoft Technologies,** Represented by its Sole Proprietor **Sri M. Kumara Swamy,** S/o M. Mallaiah, aged about 50 years, Occ: Business, R/o 1-1-180/18-20, RTC 'X' Roads, Hyderabad-500020. Ph No: 8897062791.

Take Notice that the above named Plaintiffs have instituted the above suit against you for recovery of **Rs.3,03,128/-** together with costs and future interest. You are hereby summoned to appear before the Hon'ble Court in person on the **03rd January, 2024,** at 10.30 am. In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.

//By Order of the Court//
**Sd/- N. VENUGOPALA RAO**
**Advocate**
1-2-234/2/1, Plot No.2/P, Road No.4, SRL Colony, Kothapet, Hyderabad. **Cell: 98492 64568**

**IN THE COURT OF THE HON'BLE VII JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS AT HYDERABAD**
**O.S.No. 2812 of 2019**

Between:
**Canara Bank,** Afzalgunj Branch, Hyderabad ...**Plaintiff**
And
**Sri Shaik Imtiyaz and another** ...**Defendants**

To,
**1. Sri Shaik Imtiyaz** S/o Shaik Anwar, aged about 40 years, Occ: Business, R/o H.No.12-2-831/1/4/403, MIGH Colony, Asif Nagar, 12-2-831 to 833/C/2/101, Hyderabad. Ph No.9618420957.
**2. Sri Mohd Sameer** S/o Mohd Azeem, aged about 37 years, Occ: Business, R/o H.No. 12-2-33/1/A/120, Zeba Bagh, Ward No.16, Mehdipatnam, Hyderabad. Ph No.8019178967.

Take Notice that the above named Plaintiffs have instituted the above suit against you for recovery of **Rs.3,09,047/-** together with costs and future interest. You are hereby summoned to appear before the Hon'ble Court in person on the **28th December, 2023,** at 10.30 am. In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.

//By Order of the Court//
**Sd/- N. VENUGOPALA RAO**
**Advocate**
1-2-234/2/1, Plot No.2/P, Road No.4, SRL Colony, Kothapet, Hyderabad. **Cell: 98492 64568**

**IN THE COURT OF THE HON'BLE XIV ADDL.CHIEF JUDGE: CITY CIVIL COURT AT HYDERABAD**
**G.W.OP.NO.38 OF 2023**

Between:
Kondal Rao Madaram and 2 Others. ...**Petitioners.**
AND
All Concerned ...**Respondents**

**PUBLIC NOTICE**

To:
All Concerned.

The General Public is hereby informed that the above named petitioners have filed the above Guardian O.P. before this Hon'ble Court to appoint the Petitioner No.1 as guardian of minor **Ms. SMTITI MADARAM** D/o. Kondal Rao Madaram and the said O.P. Stands posted to **11-1-2024.** If any person or persons has/have got any objection in this regard, they may appear before this Hon'ble Court on **11-1-2024** at about 10.30 AM either in person or through counsel alongwith relevant documentary evidence. Thereafter no claims will be entertained.

//By Order of the Hon'ble Court//
**Sd/-M/S K.NAGARJUNA RAO**
**AFZAL BIYABANI**
Advocates.
Off: 11-14-304, Sirinagar, L.B.Nagar, Hyderabad-T.S.
**Cell No: 9948997479**

**PUBLIC /CAUTION NOTICE**

This is to inform to one and all that I have lost/misplaced a Plastic Folder containing important papers including my original sale deed bearing document number 1303 of 1990, dated 31st March, 1990, registered with the Office of the Joint Sub-Registrar-II, Sangareddy, in respect of Plot No.150, admeasuring 309 Sq.Yards, forming part of S.No.160/ఆ, situated at Kardanoor Village, Patighanapur Gram Panchayat, Patancheru Mandalam, Medak District, Telangana, on my visit, along with my husband, to the Office of the Sub-Registrar, Patancheru, Telangana,and inspite of best efforts the said plastic folder is untraceable. Therefore, any person coming into custody of such plastic folder containing the above documents is requested to return the same to the undersigned at the below mentioned address and such finder shall be suitably rewarded. It is also informed by way of abundant caution to the general public to not to deal with the aforesaid property by impersonators and imposters trying to alienate/create third party interest by misrepresentation and fraudulent means by concealing the true facts and any such dealing will not be binding upon the undersigned and such person/s will be doing so entirely at his/her/their risk and responsibility.

**Sd/- Smt.Kalawati Chandak,**
**W/o. Sri Madanlal Chandak,**
R/o. H.No.4-7-89/1, Shivaji Nagar, Attapur, Hyderabad-500048-T.S.
**Cell No.7382601351**

**BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-2**
**1st Floor, Triveni Complex, Abids, AT: HYDERABAD**
**O.A.NO:760 OF 2023**

SUMMONS UNDER SUB-SECTION (4) OF SECTION 19 OF THE ACT, READ WITH SUB-RULE (2A) OF RULE 5 OF THE DEBT RECOVERY TRIBUNAL (PROCEDURE) RULES, 1993

Union Bank of India
Vs
Mrs. Veligandla Deepika and Another,

To,
1. Mrs. Deepika Veligandala, W/o.Suneel Kumar Veligandla, Aged about: 37 years, Occ: Business, R/o. Plot NO.67, New Balaji Colony, Tirupathi, Andhra Pradesh-517501
2. Mr.V.Suneel Kumar, S/o. V.Radhakrishna Hari, Aged about: 48 years, Occ: Business, R/o. Plot NO.67, New Balaji Colony, Tirupathi,Andhra Pradesh-517501
....Defendants

Whereas O.A.No. 760 of 2023 is listed before Hon'ble Presiding Officer/Registrar on 16/11/2023.
Whereas, this Hon'ble Tribunal is pleased to issue summons/notice on the said Application under section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of Rs.47,66,888-75Ps. (application along with copies of documents etc., annexed).
In accordance with sub section (4) of section 19 of the Act, you the defendants are directed as under:
(i)To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted.
(ii)To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application.
(iii)You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties,
(iv)You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal.
(v)You shall be liable to account for the sale proceedings realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceedings in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before the Registrar, Debts Recovery Tribunal-2 on 29/12/2023 at 10.30 A.M., failing which the application shall be heard and decided in your absence.
Given under my hand and seal of the Tribunal on this the 16th day of November,2023..

**By Order of the Tribunal**
**REGISTRAR**
**DEBTS RECOVERY TRIBUNAL-2, HYDERABAD**

## చెరువులు, కుంటల పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం : మధుయాష్కిగౌడ్



సీపీఐ నాయకులతో కలిసి చెరువులను పరిశీలిస్తున్న మధుయాష్కి

**హయత్‌నగర్, డిసెంబరు 12 ప్రభాతవార్త:** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎల్.బి.నగర్ నియోజకవర్గ పరిధిలోని చెరువులు ఆక్రమణలకు గురయ్యాయని టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కిగౌడ్ ఆరోపించారు. హయత్‌నగర్ రెవెన్యూ పరిధి సర్వేనెంబరు 98, 99లోని హత్తిగూడ చెరువును ఆయన మంగళవారం సీపీఐ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హత్తిగూడ చెరువుకు పుల్లారెడ్డి స్వీట్‌హౌజ్ నుంచి సుమారు 6 కాలనీల మీదుగా వరదనీరు చేరుతుందన్నారు. అక్కడి నుంచి కుంట్లూర్ చెరువులోకి వెళ్లేదన్నారు. కాలువల ఆక్రమణ కారణంగా వరదనీరు చెరువులోకి రావడంలేదని దీంతో లక్ష్మిభవాని కాలనీ జలమయం అవుతుందన్నారు. ఈ విషయంపై ఇబ్రహీంపట్నం ఆర్డీవోతో ఫోన్‌లో మాట్లాడిన ఆయన చెరువు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్డీవో సానుకూలంగా స్పందించారని, క్షేత్రస్థాయిలో పరిశీలించి చెరువు ఆక్రమణపై తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజాప్రతినిధులు, అధికారులు కుమ్మక్కై ప్రభుత్వ స్థలాలు, చెరువులు కుంటల ఆక్రమణలకు తోడ్పాటు అందించారని మండిపడ్డారు. ముఖ్యమంత్రితో మాట్లాడి గ్రేటర్ పరిధిలోని చెరువులు కుంటల పరిరక్షణలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, ఎల్.బి.నగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, రమావత్‌సక్రు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ఘనసన్మానం



ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న కార్పొరేటర్ శాంతి శేఖర్

**తార్నాక, ఉప్పల్, డిసెంబర్ 12 ప్రభాతవార్త:** ఉప్పల్ ఎమ్మెల్యేగా భారి మెజార్టీతో గెలుపొందిన బండారి క్ష్మారెడ్డిని నాచారం కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ మంగళవారం ఘనంగా సన్మానించారు. లక్ష్మారెడ్డి అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన ఫోటోను కార్పోరేటర్ జ్ఞాపికగా ఇంచారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయిజన్ శేఖర్, సాయికుమార్, సాయిదేవ్, సాహితి పాల్గొన్నారు.

**వైద్య సిబ్బంది సత్కారం...** ఉప్పల్ ఎమ్మెల్యేగా ఎన్నికైన బండారి లక్ష్మారెడ్డిని మంగళవారం ఉప్పల్ ఆరోగ్య కేంద్రం సిబ్బంది కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ బోగ ప్రకాష్,నగేష్, గొంగడయ్య, ఎఎన్ఎంలు, అశా వర్కర్లు తదితరులు ఎమ్మెల్యేను కలిసి సత్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ ఆరోగ్య కేంద్రం సిబ్బందికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించాలని, ఆరోగ్య కేంద్రంలో మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు అన్య బాలకృష్ణ, పలువురు అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పేద వర్గాలకు ఉచిత న్యాయ సహాయం




సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి ఇందిరా

**ఎల్‌బినగర్, డిసెంబర్ 12 ప్రభాతవార్త:** సమాజంలోని నిరుపేదలకు ఉచిత న్యాయ సదుపాయాలు ఉన్నాయని వాటిని తెలియజేయడానికి తమ సంస్థను సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, జిల్లా సీనియర్ న్యాయమూర్తి ఇందిరా పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ చిత్రలేఅవుట్‌లోని మహాత్మాగాంధీ న్యాయ కళాశాలలో మంగళవారం ప్రథమ సంవత్సర విద్యార్థుల తరగతుల ప్రారంభ సమావేశ కార్యక్రమానికి ఇందిరా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ న్యాయవిద్యార్థులు వివిధ సెక్షన్లను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు. మన బాధ్యతలను పూర్తిగా తెలుసుకొని హక్కులను సాధించుకోవాలన్నారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ గంగుల గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల అభివృద్ధిలో తమ విద్యార్థులు అధ్యాపకులు కృషి ఎంతో ఉందన్నారు.తమ కళాశాలలో ఉత్తమ బోధన ద్వారా ఎంతోమంది విద్యార్థులు న్యాయవాదులుగా ఎదిగారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎల్ఎస్ఏ సభ్యురాలు డాక్టర్ అమితారాణి, హైదరాబాద్ జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, వైస్‌ప్రిన్సిపాల్ పి.సత్యం, అధ్యాపకులు దేవి, మూర్తి, శ్రీదేవి పాల్గొన్నారు.

## పట్టుదలతో ప్రయాణిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారు : రామకృష్ణ



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న రామకృష్ణ

**ఎల్‌బినగర్, వనస్థలిపురం, డిసెంబర్ 12 ప్రభాతవార్త:** పట్టుదలతో ప్రయత్నిస్తే ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ రామకృష్ణ పేర్కొన్నారు. పదవ తరగతి విద్యార్థులకు 2023-24 వార్షిక పరీక్షల ప్రేరణ సదస్సు కార్యక్రమం ప్రలవి గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకునే వారు తప్పక తమ లక్ష్యాలను చేరుకుంటారని అన్నారు. వార్షిక పరీక్షలు వరకు గల విలువైన ఈ కొద్ది సమయాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థుల ఆకాంక్షలను నెరవేర్చే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. ఈ సదస్సులో భాష్యం విద్యా సంస్థల ముఖ్యసలహాదారు మైఖేల్, హైదరాబాద్ సీఈవో చైతన్య, జెడ్ఈవో అంకమ్మరావు, ఆర్కెపురం ప్రిన్సిపాల్ అప్పారావు, పలు శాఖల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కెసిఆర్ వేగంగా త్వరగా కోలుకొని ప్రజా క్షేత్రంలోకి రావాలి: సబితా ఇంద్రారెడ్డి



యశోదా ఆసుపత్రిలో కెసిఆర్‌ను పరామర్శిస్తున్న సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, డిసెంబర్ 12 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ అతి త్వరగా కోలుకొని తిరిగి ప్రజా క్షేత్రంలోకి రావాలని రాష్ట్ర మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి అన్నారు. కాలి తుంటి ఎముకకు గాయంకావడంతో యశోదా ఆసుపత్రిలో శస్త్ర చికిత్స జరిగి కోలుకుంటున్న కెసిఆర్‌ను ఆమె మరో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్‌తో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె కెసిఆర్‌తో మాట్లాడి వేగంగా కోలుకోవాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కెసిఆర్ త్వరితగతిన కోలుకోవాలని కోరుకుంటున్నా రని ఆమె అన్నారు. అనంతరం సబితారెడ్డి కెసిఆర్ తనయుడు, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కెటిఆర్‌ను కలిసి మాట్లాడారు.

## రామంతాపూర్ పెద్ద చెరువు ఎఫ్‌టిఎల్‌ను నిర్ధారించేందుకు అధికారుల సర్వే



రామంతాపూర్ పెద్ద చెరువు ఎఫ్‌టిఎల్ సర్వే చేస్తున్న అధికారులతో బిఆర్ఎస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 12 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని రామంతాపూర్ పెద్ద చెరువుకు ఎఫ్‌టిఎల్ నిర్ధారిచేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. హైకోర్టు ఆదేశాల మేరకు రామంతాపూర్ పెద్ద చెరువు చుట్టూ పెన్సింగ్ వేయాలని నిర్ణయించారు. ఉప్పల్ తహసీల్దార్ వెంకట నరసింహారెడ్డి, ఇరిగేషన్ నరేష్‌రెడ్డి, ఎఇ పుద్వి ఇతర అధికారులు పాల్గొని చెరువు వద్ద పనులను పరిశీలించారు. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి పలువురు స్థానికులతో కలిసి అధికారులకు పలు సూచనలు చేశారు. 2023 సర్వే ప్రకారం చెరువు హద్దులు ఏర్పాటు చేస్తే చాలా మందికి నష్టం జరిగే అవకాశం ఉందని, 2016లో హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు సర్వే చేసి ఎఫ్‌టిఎల్ నిర్ణయించాలని కోరారు. దీనిపై స్థానికుల నుంచి పలు విన్నపాలు రావడంతో అధికారులు దీనిపై తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. త్వరలోనే హద్దులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపలువురు కాలనీవాసులు, స్థానికులు పాల్గొన్నారు.

## మహాలక్ష్మి సంక్షేమ పథకంతో ఆటో కార్మికుల పొట్టకొట్టొద్దు : రాయబండి

**ఎల్‌బినగర్, డిసెంబర్ 12 ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన మహాలక్ష్మి పథకం మహిళకు బస్సులు ఉచిత ప్రయాణం ఆటో కార్మికుల పొట్ట కొట్టిందని వర్కర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాయబడి పాండురంగం ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం వర్కర్స్ పార్టీ రాష్ట్ర కార్యాలయం కొత్తపేటలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ మహాలక్ష్మి స్కీం మంచిదే అయినప్పటికీ ఆటో కార్మికులు బజార్లో పడే అవకాశం ఉందని, వీరికి వెంటనే రూ.20వేల జీవనభృతిని కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని లక్షల కుటుంబాలు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న తరుణంలో మహాలక్ష్మి స్కీం ద్వారా కార్మికుల పరిస్థితులు రోడ్డున పడే అవకాశమున్నందున, వీరిని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని, లేనిపక్షంలో ఆటో కార్మికుల పక్షాన ఉద్యమించాల్సి వస్తుందని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు కామేశ్వరరావు, కొప్పు యాదయ్య, ఎస్‌వి.రాములు తదితరులు పాల్గొన్నారు.

## వంశరాజ్‌ల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తా : ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



రామంతాపూర్‌లో వంశరాజ్ సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 12 ప్రభాతవార్త :** వంశరాజ్‌ల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.ఈ మేరకు మంగళవారం రామంతాపూర్ వంశరాజ్ సంక్షేమ సంఘం నూతన క్యాలెండర్‌ను వంశరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిటికెల కృష్ణ వంశరాజ్, ప్రధాన కార్యదర్శి పాయసం గోపాల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని క్యాలెండర్ అవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో వంశరాజ్ కులస్థులను తనకు పూర్తి మద్దతు ప్రకటించారని, వారి సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానన్నారు. విద్య, వైద్య, ఇతర అవసరం ఉంటే తనకు సమాచారం ఇవ్వాలని, తాను వారికి తగు సహకారం అందిస్తానని తెలిపారు. ప్రభుత్వ పరంగా వంశరాజ్‌లకు అందాల్సిన సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వంశరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు బాలస్వామి, తిరుపతయ్య, చిన్న కృష్ణ, వెంకటయ్య, నరసింహ, దేవయ్య, కాశయ్య,బాలు, వీరస్వామి, బాలస్వామి, మల్లేష్, రాము, చందు, మల్లయ్య, శ్రీనివాస్ పలువురు సభ్యులు,మహిళలు పాల్గొన్నారు.



ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని వనస్థలిపురం తూర్పు కాలనీల సంక్షేమ సంఘము తరపున అధ్యక్షులు దీపావళి శ్రవణ్‌కుమార్, జనరల్ సెక్రటరీ గుత్తా లక్ష్మణ్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీకాంత్, జలందర్ రెడ్డి, సుధీర్‌రెడ్డి తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న దృశ్యం (ప్రభాతవార్త, వనస్థలిపురం)

## ఎమ్మెల్యే మల్‌రెడ్డికి శుభాకాంక్షల వెల్లువలు



ఎమ్మెల్యే మల్‌రెడ్డికి శుభాకాంక్షల తెలుపుతున్న నాయకులు

**తుర్కయంజాల్, హయత్‌నగర్, డిసెంబర్ 12 ప్రభాతవార్త:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గ నూతన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. తుర్కయంజాల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఓర్సు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులతో కలిసి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ గ్యారంటీలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లేందుకు కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కార్యకర్తల కృషివల్లే ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ పార్టీని, తనను అఖండ మెజార్టీతో గెలిపించారని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సామల రవీందర్‌రెడ్డి, మర్రి సుధాకర్‌రెడ్డి, గుండా గిరి, శ్రీనివాస్‌రెడ్డి, కుంట నర్సింహారెడ్డి, సంజీవ, శివ, ఎం.సత్తిరెడ్డి, కె.అశోక్, మర్రి వెంకటరెడ్డి, కె.మల్లేశ్, యుగేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**మల్‌రెడ్డిని కలిసిన సీపీఐ నాయకులు...** సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీంద్రాచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డిల ఆధ్వర్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండల నాయకులు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన విజయంలో సహకరించిన సీపీఐ నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్‌పాలనలో ఇబ్బందులుపడ్డ ప్రజలకు స్వాంతన చేకూర్చేలా పాలన కొనసాగించాలని సీపీఐ నాయకులు కోరారు.

## శ్రీ కాల భైరవస్వామి ఆలయంలో పూజలు

**ఉప్పల్, డిసెంబరు 12 ప్రభాతవార్త :** ఉప్పల్ భగాయత్‌లోని స్వయంభూ శ్రీ కాలభైరవస్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటి నేతలు లక్ష్మణ్, శామీర్‌పేట వినోద్‌రెడ్డి, బొమ్మల సుధాకర్, రమాకాంత్‌రెడ్డి, కంచెమీది శిలయ్య, ఈగ సంతోష్, బొట్టు వెంకట్‌ముదిరాజ్, రాకేష్‌రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మంగళవారం ఉదయం సుప్రభాతం, ప్రభాతకాల సేవ, అభిషేకం, హారతి, తీర్థప్రసాద వితరణ, మధ్యాహ్న కలా సేవ, అభిషేకం, అన్నప్రసాద వితరణ, పదోషకాల సేవ, అభిషేకం, కాలభైరవస్వామి ఊరేగింపు, జ్వాల తోరణం, మహాశివునిపూజ, జాగరణ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆలయ కమిటి నేతలు, స్థానికులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నాయకులకు సద్బుద్ధి కలగాలి : కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి



దున్నపోతకు వినతి పత్రం సమర్పిస్తున్న కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, చౌకి రవికుమార్ తదితరులు

**మలక్‌పేట, డిసెంబర్ 12 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ నాయకులు అధికారం కోల్పోవడంతో మతి భ్రమించి మాట్లాడుతున్నారని వారికి సద్బుద్ధి ప్రసాదించాలని కోరుతూ ఓల్డ్ మలక్‌పేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో దున్నపోతుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు ధైర్యం చెప్పకుండా కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందని చెప్పడం హాస్యాస్పదమని దుయ్యబట్టారు. బిఆర్ఎస్ పార్టీకి సత్తా ఉంటే రానున్న పార్లమెంట్ ఎన్నికలలో తమ సత్తా చాటుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ ఓబిసి సెల్ ఛైర్మన్ చౌకి రవికుమార్, ఆకుల రాజు, రామకృష్ణ, చెగిరెడ్డి మదన్‌మోహన్‌రెడ్డి, అర్జున్‌యాదవ్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ

**ఉప్పల్, డిసెంబరు 12 ప్రభాతవార్త :** ఉప్పల్ గాంధీనగర్‌లో వంశీ గురుస్వామి 18వ మహాపడిపూజ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అయ్యప్ప పూజలతో భక్తిభావం పెంపొందుతుందన్నారు. భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వాములు పూజలు చేయడం అభినందనీయమన్నారు. అయ్యప్పస్వాములకు తన వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఆకుల మహేందర్, అన్య బాలకృష్ణ, పంగ రాజేశ్వర్‌రెడ్డి, రాజు లింగాయత్, రావుల నవీన్‌గౌడ్, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి : డాక్టర్ బి.విజయరంగ



టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభించిన లక్ష్మీకాంతం, విజయరంగ

**ఎల్‌బినగర్, డిసెంబర్ 12 ప్రభాతవార్త:** మహిళలు అన్ని రంగాలలో అభ్యున్నతి సాధించి ఆర్థికంగా బోలోపేతం కావాలని తెలంగాణ కాపు సంక్షేమ సేన ఎల్‌బినగర్ నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ బి.విజయరంగా పేర్కొన్నారు. కొత్తపేట సౌభాగ్యపురంకాలనీ కొత్తపేట ఆత్మీయ యుఎస్ఏ ఉమెన్ ఎంపవర్‌మెంట్ ప్రోగ్రాం కింద ఆత్మీయ యుఎస్ఏ, తెలంగాణ కాపు సంక్షేమ సేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్రంలో మూడవ మహిళల టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్‌ను ముఖ్యఅతిథిగా మాజీ కృష్ణా జిల్లా కలెక్టర్, మాజీ టీటీడీ జేఈవో బి.లక్ష్మీకాంతం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయుటకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్ ఉపయోగించుకుని మహిళలు ఆర్థికంగా బలపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కాపు సంక్షేమ సేన అధ్యక్షులు యం.యేసుబాబు, తెలంగాణ కాపు సంక్షేమ సేన కూకట్‌పల్లి నియోజకవర్గ కన్వీనర్ అల్లం నాగేశ్వరరావు, నాయకులు మండలి అప్పారావు, అనురాధ పాల్గొన్నారు.

## మెగా డ్రీమ్ సిటీ కాలనీలో రోడ్డు పనుల పరిశీలన : మేయర్ పారిజాత



పారిజాతను సన్మానిస్తున్న డ్రీమ్‌సిటీ కాలనీవాసులు

**సరూర్‌నగర్, డిసెంబర్ 12 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 18వ డివిజన్‌కు సంబంధించిన మెగా డ్రీమ్ సిటీ కాలనీలో జరుగుతున్న బిటిరోడ్డు పనులను మంగళవారం మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పరిశీలించారు. స్థానిక కార్పొరేటర్ బండారి మనోహర్‌తో కలిసి ఆమె కాలనీలో పర్యటించి రోడ్డుపనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా స్థానిక కాలనీ సంక్షేమ సంఘం నాయకులు రోడ్డు నిర్మాణం జరగడం పట్ల హర్షం వ్యక్తం చేసి మేయర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో 13వ డివిజన్ కార్పొరేటర్ నేనావత్ బాలు నాయక్, కాలనీ అసోసియేషన్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

**జానారెడ్డిని కలిసిన పారిజాత...** సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, కాంగ్రెస్ శాసనసభాపక్ష మాజీ నాయకుడు కుందూరు జానారెడ్డిని బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి కలిసారు. తన భర్త, బడంగ్‌పేట్ మాజీ వైస్ ఛైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డితో కలిసి ఆమె జానారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

## అన్ని వర్గాల సంక్షేమానికి కృషి : బలాల



ఎమ్మెల్యే బలాలను సన్మానిస్తున్న క్రిస్టియన్ అసోసియేషన్ ప్రతినిధులు

**మలక్‌పేట, డిసెంబర్ 12 ప్రభాతవార్త :** అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తామని మలక్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. మలక్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యేగా వరసుగా నాలుగవసారి విజయం సాధించిన అహ్మద్ బలాల క్రిస్టియన్ అసోసియేషన్ ప్రతినిధులు జయరాజ్ బెంజిమన్ ఆధ్వర్యంలో కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా క్రిసియన్లకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని హామీనిచ్చారు. క్రిస్టియన్లకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి వారి అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో క్రిస్టియన్ అసోసియేషన్ నాయకులు అనిల్ కుమార్, ఏసుపాదం, లక్ష్మణ్, అనిల్, అంద్రూస్ తదితరులు పాల్గొన్నారు.

## నీలకంఠేశ్వర స్వామికి అన్నాభిషేకం

**సరూర్‌నగర్, డిసెంబర్ 12 ప్రభాతవార్త:** పవిత్ర కార్తీక మాసం ముగుస్తున్న సందర్భంగా చివరి రోజు మీర్‌పేట్ మునిసిపల్ కార్పొరేషన్‌లోని శివసాయినగర్ కాలనీలో స్థానిక శ్రీ గౌరీ నీలకంఠేశ్వరస్వామి సమేత శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో అన్నంతో నీలకంఠేశ్వర స్వామికి మహాన్యాస పూర్వక ఏకావార రుద్రాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితుడు శ్రీకాంత్ శర్మ, దేవాలయ ప్రధాన అర్చకులు లక్ష్మీ గణపతిరావు, హయగ్రీవశర్మలు భక్తిశ్రద్ధలతో అన్నాభిషేకం జరిపారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నీలకంఠేశ్వర స్వామికి అభిషేకం జరిపిన అన్నంతో సుమారు 500 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ తీగల సుభాష్‌రెడ్డి, సభ్యులు సంతోష్‌రెడ్డి, వెంకటకృష్ణారావు, వెంకటరమణ, గంగా రామకృష్ణ, బలరామ కృష్ణ, బాపిరాజు, మురళి, శ్రీనివాస ఆంజనేయ శాస్త్రి, విశ్వనాథబాబు, నటరాజ్, మూర్తి, సుబ్రమణ్యశర్మ, మహిళలు పాల్గొన్నారు.

## ఎల్‌బినగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి విజయంతో మొక్కులు తీర్చుకున్న బిఆర్ఎస్ నాయకులు



కొబ్బరికాయలు కొడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

**ఎల్‌బినగర్, డిసెంబర్ 12 ప్రభాతవార్త:** ఎల్‌బినగర్ ఎమ్మెల్యేగా సుధీర్‌రెడ్డి మూడవసారి ఘన విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి వికాస్‌నగర్‌లోని గణేష్ గుడి దగ్గర మంగళవారం 101 కొబ్బరి కాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ నాయకులతో కలసి 101కొబ్బరి కాయలు కొట్టి మొక్కు చెల్లించుకోవడం జరిగిందని ఎమ్మెల్యే నాయకత్వంలో నియోజకవర్గ మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కనకదుర్గమ్మ గుడి డైరెక్టర్ కిషన్, కార్మిక శాఖ అధ్యక్షులు జలంధర్, బిసి నాయకుడు లక్ష్మణ్, కిరణ్, యువ నాయకుడు చింటు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నేత గడ్డం రవికి సతీ వియోగం

**ఉప్పల్, డిసెంబరు 12 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ రామంతాపూర్ బిఆర్ఎస్ నేత గడ్డం రవికుమార్‌కు సతీ వియోగం జరిగింది. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న లక్ష్మి ప్రసన్న ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. దీంతో విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, బిఆర్ఎస్ నేతలు అరటికాయల భాస్కర్, సర్వ బాబుయాదవ్, బన్నాల ప్రవీణ్, మేకల మధుసూధన్‌రెడ్డి, సర్వ సత్తయ్య, చాంద్‌పాషా, ఎస్.నరేష్, పలువురు పార్టీ నేతలు లక్ష్మి ప్రసన్న పార్థీవదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. గడ్డంరవికుమార్ కుటుంబానికి తమ వంతు చేయూత అందిస్తామన్నారు. అనంతరం రామంతాపూర్ స్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.



మహేశ్వరం ఎమ్మెల్యేగా విజయం సాధించిన సబితా ఇంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందించిన నాయకులు హామద్ భాయ్, షాకీర్ బేగ్, అమ్జాద్ ఖాన్, సయ్యద్ ఫిరోజ్, అలీ మన్సూరీ, సూరెడ్డి కృష్ణారెడ్డి తదితరులు (సరూర్‌నగర్, ప్రభాతవార్త)